# కొండమల్లెలు

వాయుదూత్ విమానంలో కూర్చుంటూ మేజర్ రామ్‌చందర్ ఉరఫ్ చంద్రం తనలోనే నవ్వుకున్నాడు. ఇదివరలో ఎన్నడూ అంత చిన్న ఎయిర్ క్రాఫ్ట్‌లో ప్రయాణించలేదు. లెక్కపెడితే గట్టిగా పదిహేను సీట్లయినా లేనట్టుంది. ఆ మాటే కాస్త తన ముందు సీట్లో కూర్చున్న ప్రయాణీకుడు విన్నంతగా పైకి అనేశాడు. "మీరు తొలిసారి మిజోరమ్ వెళ్తున్నారనుకుంటాను. పెద్ద విమానాలు దిగేటంత విశాలమైన విమానాశ్రయాలు లేవు. అంతా కొండల మయం'' అన్నాడతను- చేతిలోని వార్తాపత్రికను తెరుస్తూ. ఆ క్షణంలో చంద్రానికి ఏనాడో నాయనమ్మ అన్న మాటలు గుర్తొచ్చాయి.

"మీ తాత మాత్రం వైద్యం చెయ్యలేదట్రా చంద్రం! కడుపులో చల్ల కదలకుండా ఉన్న ఊళ్లోనే ఆ మహారాజు ఎంత పేరు తెచ్చుకున్నారు. ఇంత చదువూ చదివి నువ్వు దేశాలు పట్టి పోతవటరా?'' అని కంట తడిపెడుతూ కౌగలించుకుంది బామ్మ.

అలా చంద్రం ఆర్మీలో చేరి ఏడేళ్ళయింది. ఆర్మీ మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ పూర్తిచేసిన తర్వాత గ్రేడెడ్ స్పెషలిస్టుగా నిలదొక్కుకుని రెండేళ్ళు పూర్తి కావస్తున్న తరుణంలో ఈ పోస్టింగ్ వచ్చి పడింది. గతాన్ని నెమరవేసుకుంటూ ఏవేవో ఆలోచనల వలయాల్లో పడి తిరుగుతూ వుంటే ఆ చిన్న లోహవిహంగం బంగ్లాదేశ్ పొలిమేరలు దాటి మిజోరమ్ దిశగా క్రిందకు దిగుతోంది. దూరం నుంచి పనసకాయ ఉపరితలంలా కనుపిస్తున్న భూభాగమంతా ఆకుపచ్చని కొండల దొంతరగా మారిపోతూ తనని ఆశ్చర్యపరుస్తూ వుంటే ఇరుకైన అయిజోల్ విమానాశ్రయంలో ఉదయం పది గంటల వేళ దిగాడు చంద్రం.

బలబీర్‌సింగ్ స్టీరింగ్ వీల్ పట్టుకుని అవలీలగా జీపుని పాము మెలికల్లా సాగిన ఘాట్ రోడ్డుమీంచి తీసుకుపోతూవుంటే తన మెడికల్ కాంప్లెక్స్ చేరుకోడానికి సుమారు పన్నెండు

గంటలు పట్టింది. మధ్యలో చెరో గంట కాలం సీలింగ్‌లోనూ, సర్‌చిప్‌లోనూ విశ్రాంతి తీసుకున్నాడు కాబట్టి సరిపోయింది కానీ సామాన్యంగా ఆ ప్రయాణం తట్టుకోవడం కష్టమే.

'వేళాపాళా లేకుండా కూసింది పాడుకోడి' అనుకుంటూ చేతి వాచీ చూసుకున్నాడు. మూడున్నర దాటింది. కొత్త ప్రదేశం కావడాన్న మరి నిద్రపట్టలేదు. దగ్గరగా ఉన్న కిటికీ తెర తొలగించి చూశాడు. అప్పుడే పగటి వెలుగులు! మళ్ళాఒకసారి వాచీ చూసుకున్నాడు. నాలుగు దాటి పదిహేను నిముషాలౌతోంది. చిన్నగా నవ్వుకున్నాడు. పగటి వెలుగులు మొట్టమొదట సోకే ప్రాంతంలో తను ఉన్నట్లు గుర్తు చేసుకున్నాడు. పచ్చన్ని కొండ చరియలో మొట్ట మొదటి అంతస్తులో ఆసుపత్రి, రెండవ అంతస్తులో ఉద్యోగులందరికీ నివాసాలు, మూడవ అంతస్తులో పూజా మందిరం, దాని చుట్టూ కిచన్ గార్డెన్, నాలుగో అంతస్తులో ఆఫీసర్స్ మెస్. ఆ పైన కొండ శిఖరాన్ని కాస్త నునుపు చేసి నిర్మించిన హెలీపాడ్. వీటన్నిటినీ కలుపుతూ అందమైన ఒక రక్షిత ప్రాంతంగా గ్రెఫ్ సంస్థఇంజనీర్లు తీర్చిదిద్దిన ఆ పరిసరాలు తిరిగి వచ్చాడు. ఎదురుగా ఉన్న కొండమీంచి ఒక కొండవాగు చిన్నగా సంగీతం వినిపిస్తూ లోయలోకి దూకుతోంది.

అంతా బాగానే ఉంది. అయితేనేం. చంద్రం పచ్చి నెలమీద పదిహేను రోజులు అయినా మెస్‌లోనే ఉంటున్న ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ కల్నల్ సురేందర్‌షా మాత్రం ఒకంతట తనకు అర్థం కావడంలేదు. ఎత్తుగా హుందాగా, అందంగా ఉంటాడు కానీ, ముభావంగా కాసింత మత్తుగా ఉంటాడు. నిత్య సిగరెట్ పిపాసి. వృత్తిరీత్యా ఎనెస్తీషియోలజిస్టు కావడంవల్ల ప్రవృత్తి అలా ఉందేమో అనుకున్నాడు.

ఒక ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేస్తూ"ఈ ప్రాంతం అందంగా ఉంది సర్"అన్నాడు షాని కాస్త మాట్లాడించాలన్న కోరికతో వున్న చంద్రం."కుమాన్ అడవుల్లో పుట్టి పెరిగిన వాడికి ఈ ప్రాంతం చాల పేలవంగా కనిపిస్తుంది" అన్నాడు షా నిర్లిప్తంగా.

"సర్జికల్ కేసులు బొత్తిగా తక్కువ. చెప్పుకోదగ్గ సంఖ్యలో లేవు"అంటూ చంద్రం తన పరిశీలనను ప్రకృతినుంచి వృత్తిధర్మం వేపుకి మళ్ళించాడు. షా మౌనంగా సిగరెట్ పొగ వలయాలు గాలిలోకి వదుల్తున్నాడు.

"ఆ వచ్చిన సర్జకల్ కేసులైనా ఏమాత్రం వైవిధ్యం లేనివి. హెర్నియాలూ-హైడ్రోసిల్స్......... అవుట్ పేషంట్లకు మందులు రాసి పంపించాక గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవడం....." అని టీ కప్పు అందుకున్నాడు చంద్రం.

"అయితే నేం. ఇంత వరకూ చేతినిండా పనితో ఉక్కిరి బిక్కిరి అయిపోయుంటావు. కాస్త విశ్రాంతి తీసుకో. పెళ్ళాం పిల్లల్ని విడిచి ఇంత దూరం వచ్చి ఈ కొండల్లో ఇంత కన్నా కష్టపడాలా?" షా మాటల్లో ఏదో మందలింపు ధ్వనించింది.

"నాకు ఇంకా పెళ్ళాం రాలేదు" చిన్నగా నవ్వాడు చంద్రం.

"అవును. తెలుస్తూనే వుంది. సర్జికల్ కేసులు మనం సృష్టిస్తామా ఏమిటి? కడుపు చేత్తో పట్టుకుని బ్రతుకు తెరువుకోసం ఇంత దూరం వచ్చిన లేబరూ, గ్రెఫ్ సంస్థ ఇంజనీర్లూ ఉద్యోగులూ ఆరోగ్యంగానే ఉంటారు. వానలు మొదలయితేకదా మలేరియా జ్వరాల్ల దాడి..." అని షా యాష్ ట్రేలోకి సిగరెట్ నుసి దులిపాడు. అలా మనసు విప్పి మాట్లాడే మూడ్‌లో షా వుండడం చూసి శ్రోతగా వింటున్నాడు చంద్రం.

"నువ్వు వచ్చిన దగ్గరనుంచీ నే చూస్తూనే వున్నాను. ఎలా లాక్కొస్తున్నావో తెలియదు కానీ చేతులూ కాళ్ళూ విరుచుకున్న కప్పులనీ, కప్పీలనీ (మిజో పురుషుల్నీ, స్త్రీలనీ అలా ప్రస్తావిస్తారు) తెచ్చి వార్డు నింపేస్తున్నావు. గుడ్‌విల్‌గా స్థానికులకు ప్రథమ చికిత్స అవసరమైనంత వరకూ చేసి వాళ్ళని సివిల్ హాస్పిటల్‌కి పంపితే చాలు. అంతకన్నా బాధ్యత నెత్తి నేసుకోనక్కరలేదు. వాళ్ళకి స్థానికంగా వాళ్ళ హాస్పిటల్స్ ఉన్నాయి. ఈ కొండల్లో కీలకమైన రోడ్లు వేసి, వంతెనలు కట్టి కష్టపడుతున్న గ్రెఫ్ సంస్థ ఉద్యోగులకీ-వాళ్ళ కాజువల్ లేబర్‌కీ వైద్య రక్షణ కల్పించడం మన విధి" అన్నాడు షా.

"మీరన్నది నిజమే. కానీ ఉత్సాహంగా ఉన్న సర్జికల్ స్పెషలిస్టుని తీసుకొచ్చి కరియర్ ప్రారంభంలోనే ఇలాటి చోట పడేస్తే ఏం పని చేసినట్టు చూపించాలి. ఏం అనుభవం గడించాలి. రెండు మూడేళ్ళ విలువైన కాలం ఇలా ఏ చాలెంజింగ్ జాబ్ లేకుండా గడిచిపోతే సూపర్ స్పెషాలిటీకి అప్లయి చేసినప్పుడు ఏ అనుభవాన్ని చెప్పుకోవాలి....."

"నిజమే నీ బాధ కాస్తంత అర్థమైంది. మధ్యాహ్నం తీరిక ఉన్నట్లు తోస్తే లుంగ్లే సివిల్ హాస్పిటల్‌లో ఏవైనా కేసెస్ ఉంటే ఆపరేట్ చేసి వాళ్ళకు సహాయం చెయ్యవచ్చు. మిజోలంత బద్దకిష్టు వాళ్ళనీ, వెనుకపడ్డ వాళ్ళనీ నేనెక్కడా చూడలేదు. వాడి భాష తప్ప ఇంకో భాష నేర్చుకునే ఉత్సాహం చూపడు. వచ్చినా రానట్టు కనిపిస్తాడు. ఇంతంత దూరం వచ్చి రోడ్లు వేస్తున్న ఉద్యోగుల మీద కాసింత ప్రేమా గౌరవం కనపరచడు-వాడికేదైనా పని పడితే తప్ప...."

"అవుట్ పేషంట్ల సంఖ్య కూడా చెప్పుకోదగ్గట్టూ లేదు."

ఈ మాట వింటూనే నీ పిచ్చికూలా అన్నట్లు చంద్రంవంక చూసి జాలిగా నవ్వుతూ

"నువ్వు అదృష్టవంతుడివి. అక్టోబర్ చివరలో వచ్చావు. ఏప్రిల్ నుండి అక్టోబర్ దాకా వానలు విడవకుండా దంచుతాయి. దోమలు, ఈగలు, జలగలు, ఎన్నో కీటకాలు, మలేరియా జ్వరాలు, చావులు.. ఇక చెప్పకుంటే మంచిది, పద పోదాం వార్డుకి" అంటూ లేచాడు కల్నల్ షా. ఇద్దరూ మెట్లు దిగి హాస్పిటల్‌కి బయలుదేరారు.

ముఖ్యమైన సిగ్నల్స్ ఇచ్చి గ్రెఫ్ సంస్థ అధికారులతో సంప్రదించుకోడానికి వైర్‌లెస్ సిస్టమ్ ఉంది కానీ విశాఖలో ఉంటున్న తన తల్లిదండ్రులతో చంద్రం మాట్లాడాలంటే సుమారు ఇరవై కిలోమీటర్లు పోయి లుంగ్లే పట్నం నుంచి ఫోన్ చెయ్యవలసి వచ్చేది. అలా లుంగ్లే వెళ్ళి వస్తూన్న సమయంలో ఒక రోజు తటస్థపడ్డ వ్యక్తి లాల్ దిన్ లియానా. సివిల్ హాస్పిటల్ అన్న బోర్డు కనిపించగానే బలబీర్ సింగ్‌ని ఒక నిమిషం జీప్ నిలపమని చెప్పి లోనికి వెళ్ళాడు చంద్రం. గది ముందు గోడకున్న పేరు చూసి 'నేను - మేజర్ రాంచందర్'. అని తనంత తానుగా పరిచయం చేసుకుని, "మీ చికిత్సా విధానం ఎలాటిదో, మీకు నిత్యం ఎదురయ్యే సమస్యలేమిటో తెలుసుకుందామని కుతూహలంతో వచ్చాను" అన్నాడు.

లాల్ దిన్ లియానా అన్న పేరును ఉచ్చరించడంలో శ్రమ పడుతున్న చంద్రాన్ని చూసి చిరునవ్వుతో కరచాలనం చేస్తూ "నన్ను సంక్షిప్తంగా దీనా అని పిలవవచ్చు" అని సూచించాడు ఆ సివిల్ అసిస్టెంట్ సర్జన్. ఆ కరచాలనంలో ఎంతో ఆప్యాయతా గౌరవం కనపరచాడు దీనా. "మాకు ఇక్కడ చేతినిండా పని ఉంటుంది. తీరిక ఉండదు. కానీ ఒక్కొక్క సమయంలో వచ్చిన సమస్యను ఎదుర్కొందుకు సరియైన పరికరాలూ సదుపాయాలూ ఉండవు. అలాటి సమయంలో నా పేషంట్లను అయిజోల్‌లో ఉన్న పెద్ద ఆసుపత్రికి పంపవలసి వస్తుంది. పేషంట్లు సుమారు పది గంటలు మించిన ప్రయాణానికీ, ఖర్చుకీ తట్టుకోవాలి" అన్నాడు. ఇంతలో అక్కడికి వచ్చిన టీ కప్పు అందుకుంటూ వుంటే "మీరు ఆర్థోపెడిక్ సర్జనా?" అని దీనా కుతూహలంగా అడిగాడు. "నేను జనరల్ సర్జరీ చేశాను. అయితే ఆర్థోపెడిక్ కేసులు బాగా ఎక్కువ సంఖ్యలోనే చూశాను" అంటూ టీ రుచి చూస్తున్నాడు చంద్రం.

"మీరు వెంటనే వెళ్ళవలసిన పని ఒత్తిడి లేకుంటే నేనొక కేసు చూపిస్తాను. సరిగ్గా సమయానికే వచ్చారు."

"నాకేమీ తొందరలేదు. చెప్పండి..."

"కుర్రవాడుచిన్నవాడే. పదహారేళ్ళు ఉంటాయి. చెట్టు మీంచి పడ్డాడు. తొడ ఎముక విరిగింది. ఎంత కష్టపడి సెట్ చేసి ప్లాస్టర్ వేసినా ఎముక స్థాన భ్రంశమైపోతోంది. ఇప్పటికి అలా మూడుసార్లు ప్రయత్నించాను. పోనీ అయిజోల్ పంపుదామా అంటే వాడు అంతఖర్చు భరించలేడు. ఖర్చుకి జంకి వెళ్ళడం మానేస్తాడు. ఇంకా ఎంతో జీవితం ముందుంది. అలా కుంటి బ్రతుకు ఈడుస్తాడు..."

"కంటిన్యుయస్ ట్రాక్షన్ ప్రయత్నిస్తే..."

"నా దగ్గర స్టైన్ మన్స్ పిన్ లేదు.."

"అలాంటప్పుడు స్కిన్ ట్రాక్షన్ ఒక్కొక్కప్పుడు ఉపయోగపడవచ్చు. మీకు అభ్యంతరం లేకపోతే నేను ప్రయత్నించి చూస్తాను."

"మోస్ట్ వెల్‌కమ్"

దీనా ఆ కేసుకు సంబంధించిన ఎక్స్‌రే, రిపోర్టులు తీసి చూపించి కుర్రవాడి మంచం దగ్గరకు చంద్రాన్ని తీసుకుని వెళ్ళాడు.

దీనా ఆ మంచం ప్రక్కనే జాలి చూపులు చూస్తూ నిలబడ్డ కుర్రవాడి తండ్రితోనూ, మంచం మీద పడుకున్న కుర్రవాడితోనూ ఏదో మాటలాడుతూ వుంటే చంద్రం స్కిన్ ట్రాక్షన్ పద్ధతి ప్రయత్నించి స్థానం తప్పిన ఎముకను యథాస్థానంలో కలిపి నిలపగలిగాడు. చేత్తో తొడ ఎముకను తాకిన దీనా ఎంతో సంతోషంతో కుర్రవాడి తండ్రి వేపు చూస్తూ "లాల్ మోయా! ఇంక అయిజోల్ వెళ్ళే ప్రయాస లేదు. ఇక్కడే నీ కొడుకుని ఉంచు. ఎముక అతుక్కుంటుంది. సందేహం లేదు" అన్నాడు. అలా ఆ కొత్త ప్రదేశంలో తను సహాయ పడగలిగినందుకు చంద్రం కూడా తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు.

చేతి గడియారం వేపు చూస్తున్న చంద్రాన్ని ఆపి "మేజర్ రామచందర్!, ప్లీజ్ హేవ్ కాఫీ విత్ మీ. నా క్వార్టర్స్ ఇక్కడనే ఎదురుగానే ఉంది" అని చెప్పి దీనా తన ఇంటికి తీసుకుని వెళ్ళి తన భార్యకు పరిచయం చేశాడు. దీనా కంటే బాగా పొట్టిగా, తెల్ల గోధుమ రంగులో ఉంది అతని భార్య. బుగ్గ మీది ఎముకలు కాసింత ముందుకు పొడుచుకు వచ్చి, కళ్ళు లోతుగా చిన్నగా ఉన్నాయి. ఆరు నెలల పాపకు పాలు కుడుపుతూ ఎదురుగా సోఫాలో కూర్చుని, తాను స్థానిక పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నట్లు చెప్పింది. వేడి కాఫీ, బిస్కెట్లూ అందించింది.

మరునాడు ఔట్ పేషంట్లను చూశాక హెడ్ క్వార్టర్స్‌లో కొంత ఆఫీస్ పని ఉంటే జీప్

తీసుకుని టాయ్‌పూయ్ దిశగా వెళ్ళాడు చంద్రం. అక్కడ పని ముగించుకున్నాక లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చూశాడు. ది చిన్‌హిల్స్, లుషాయ్ కుకీ క్లాన్స్ అన్న పుస్తకాలు అతన్ని ఆకర్షించాయి. స్థానికుల గత చరిత్ర, జీవిత విధానం, అలవాట్లూ, కట్టుబాట్లూ వివరిస్తున్న ఆ పుస్తకాలు తీరికగా చదవాలన్న కోరికతో తన పేరుమీద తీసుకుని తిరుగు ప్రయాణం చేస్తున్నాడు. ఘాట్ రోడ్డు మీదకి ఉరికి పడబోతున్నట్లు దట్టంగా పెరిగిన వెదురు పొదలు, ఆకాశంలోకి దూసుకు పోతున్నట్లున్న టేకు మ్రాకులు, ఒక చెట్టుని ఇంకో చెట్టుతో కలిపి మెలివేస్తూ చిక్కగా అల్లుకుపోయిన అడవి తీగలు చూస్తూ వెళ్తున్న చంద్రానికి ఒక చోట ఎండ తాకని చల్లని ఒంపులో వెదురు పొదల మధ్య తేమలో వింత వింత అడవి పూలు కనపడ్డాయి. జీపుని ఆపమని బలబీర్‌కి చెప్పి క్రిందకు దిగి వ్రేళ్ళు తెగకుండా కొన్ని పూల తీగల్ని తెంపుకున్నాడు. “వీటిని మన మెస్ లాన్స్‌లో పెంచుదాం; ఒక పోలిథీన్ సంచిలో వీట్ని జాగ్రత్త పెట్టు” అని డ్రైవర్ చేతికి అందించాడు. తానెప్పుడూ చూసి ఎరగని వింత వింత రంగుల్లో ఆ పూలు ఎంతో అందంగా ఉన్నాయి. గ్రామాల్లో ఘాట్ రోడ్డు వెంబడి మిజోలు నిర్మించుకున్న ఇళ్లు విలక్షణంగా ఉన్నాయి. బలమైన చేవకట్టెలతో లోయవేపు పొడుగాటివీ, మెట్టవేపు పొట్టివీ స్తంభాలు పాతి, వాటిమీద సమతలంగా వేదిక నిర్మించి, వెదురు తడకల గోడలు లేపి, రెల్లుగడ్డితోనో రేకులతోనో పైకప్పువేసి ఇళ్ళు కట్టుకున్నారు. అమ్మల పొది లాంటి ఆకారంలో చిన్నవీ పెద్దవీ బుట్టలు చిక్కగా వెదురబద్దలతో అల్లినవి వీపు మీద వెన్నుపూస నంటుకుని వ్రేలాడ దీసుకుని అందులో కఱ్ఱా కంపా, వడ్లూ కూరగాయలూ మోసుకునిపోతూ అవలీలగా ఎత్తులెక్కి పల్లానికి దిగిపోతూ మిజోలు కనిపిస్తున్నారు. ఆరు ఏడు ఏళ్ళ ప్రాయం ఉన్న పిల్లలు చేత్తో కత్తి పట్టుకుని చిన్న చక్రాల బళ్ళు తయారు చేసుకుంటూ కూర్చుని ఎండకాగుతున్నారు.

కొంత దూరం వెళ్ళాక బలబీర్‌ను తప్పుకోమని చెప్పి జీపుని నడిపే ఉత్సాహం కనబరిచాడు చంద్రం. బలబీర్ జీపుని ఆపి సందేహిస్తూ వినయంగా ఉండిపోయాడు. “ ఇదివరకు జమ్మూలోనూ, తిరుపతిలోనూ ఘాట్ రోడ్ల మీద జీపుని నడిపాను” అన్నాడు చంద్రం. “ మిజో పిల్లలు, వాళ్ళ పెంపుడు కోళ్ళూ మేకలూ రోడ్డుమీద తిరుగుతూ ఉంటాయి. నడపడం మీకు ...” అంటూ ఏదో చెప్పడానికి సందేహిస్తున్నట్లు వాక్యం పూర్తి చెయ్యకుండా ఆగిపోయాడు బలబీర్. చెప్పదలచినదేదో చెప్పమని ఒత్తిడి చేశాడు చంద్రం. “ నాలుగేళ్ళ క్రితం నేను ఒక మేజర్ సాబ్‌ని తీసుకుని సయిహా వేపు

వెళ్తున్నాను. హటాత్తుగా నా జీపు క్రిందకు ఒక మేక ఉరుకుతూ వచ్చి పడిపోయింది. ఆ గ్రామంలోని కప్పీలంతా (మిజోపురుషులు) మమ్మల్ని చుట్టేసి నామీదికి దాడి చేశారు. మేజర్ సాబ్ ఎంత చెప్పినా వినలేదు. లోకల్ పోలీస్ వచ్చేలోగా జీపుని కాల్చడానికి సిద్ధపడ్డారు. నేను అడ్డుకోబోతే నాచేతి మీద కత్తితో పొడిచారు" అని తనమోచేతి మీది గాయపు గుర్తును చూపించాడు బలబీర్. ఇక డ్రైవర్ని ఒత్తిడి చెయ్యకుండా 'సరే పద' అని తన మెడికల్ కాంప్లెక్స్ చేరుకున్నాడు చంద్రం.

బ్రేక్ ఫాస్ట్ చేసి ఒక ఉదయం షా, చంద్రం ఆసుపత్రికి చేరుకుంటూవుంటే ఒక కప్పీ (మిజో అమ్మాయి) కుడిచేతిని ఎడమచేత్తో ఎత్తి పట్టుకుని వార్డు ముందు నిలబడి ఉంది. చదువుకున్న పిల్లలా ఉంది. మంచి దుస్తుల్లో అందంగా ఉంది. ప్రక్కనే ఒక వృద్ధుడు నిలబడి ఉన్నాడు. విసుగ్గా చూస్తూ ఏమైందని షా అడిగాడు ఆ వృద్ధుణ్ణి. "ఇది నా కూతురు. క్రింద పడింది. చెయ్యి నొప్పిగా ఉంటే తగ్గిపోతుందన్న ఆశతో ఊరుకున్నాం. కానీ తగ్గలేదు." అని స్పష్టమైన ఇంగ్లీషులో కాసింత మిజో యాసతో చెప్పాడు. "రామచందర్! ఈ కప్పీని నువ్వేచూడు. ఇవాళ షెడ్యూల్‌లో ఏవీ ఆపరేషన్లు లేవు. నేను రెండో జీపు తీసుకుని సర్‌చిప్‌లో పని చూసుకువస్తాను" అని వెళ్ళిపోయాడు.

"ఎందుకు పడ్డావ్?" అని ఆ అమ్మాయిని అడిగాడు చంద్రం. "కోరి పడలేదు. ప్రమాద వశాత్తూ పడ్డాను" అని కొంటెగా నవ్వింది. ఆమె తండ్రి కలగ జేసుకుని "నేనిక్కడకు చాలా దగ్గరలోనున్న థయిజోల్ గ్రామంలో ఉంటున్నాను. మా అమ్మాయి లుంగ్లే మార్లింగ్ కాలేజీలో చదువుకోంటోంది. మొన్న మా స్థానిక వార్తా పత్రికలో మీ గురించి వార్త పడింది. కొత్తగా వచ్చిన ఆర్మీసర్జన్ ఒక ఫ్రాక్చర్ కేసుని అయిజోల్ వెళ్ళే అవసరం లేకుండా ఆపి నయం చేశారని విని ఆ ధైర్యంతోనే మా అమ్మాయిని లుంగ్లే తీసుకెళ్ళకుండా దగ్గిరగా ఉన్నారని మీ దగ్గరకు వచ్చాను" అన్నాడు. "ఆందోళన పడనవసరం లేదు. నేను చూస్తా"నని చెప్పి చంద్రం ఎక్స్‌రే టెక్నీషియన్‌ని పిలిచి ఎక్స్‌రే తియ్యమన్నాడు. వాళ్ళకో వార్తా పత్రిక ఉన్నందుకూ, సివిల్ హాస్పిటల్‌లో తను చేసిన ఒక చిన్న పనిని అంత ప్రముఖంగా పత్రికలో ప్రకటించినందుకూ ఆశ్చర్యపోయాడు.

మెల్లమెల్లగా కొత్త వాతావరణంలోని కష్టాలుకూడా అర్థం చేసుకుంటున్నాడు చంద్రం. మార్చి, ఏప్రిల్ నెలల్లో వచ్చిపడే గాలివానలు, పెనుతుఫానులు కొండల్నీ ఎగరేసుకొని పోయేటంత హడావిడి చేస్తాయి. క్రమక్రమంగా గాలుల జోరు తగ్గినా ఎడతెరిపి లేకుండా కురిసే వానలతో విసుగెత్తిపోతుంది. ఈగలూ దోమలూ దాడిచేస్తాయి.

క్లిష్టమైన సర్జికల్ కేసు లేవీ చెప్పుకోదగ్గ సంఖ్యలో లేకపోయినా మలేరియా జ్వరాలకు మందిస్తూ వానల్లో ఎటూ స్వేచ్ఛగా తిరిగే అవకాశంకూడా లేకుండా కాళ్ళు ముడుచుకుని ఆసుపత్రిలోనో మెస్సులోనో కూర్చోవాలి.

ఒక ఉదయం, షా శలవు మీద ఢిల్లీ వెళ్ళి వచ్చాక, ఆ రోజు మధ్యాహ్నం భోజన సమయంలో "ఎలా ఉంది మీ ప్రయాణం, మీకుటుంబం క్షేమమేనా" అని అడిగాడు చంద్రం. " నా భార్యా, పిల్లలూ ఇక్కడికి వస్తామన్నారు. నేనే ఇప్పుడొద్దని వారించి డిసెంబర్‌లో రమ్మన్నాను" అన్నాడు షా. మితభాషిగా ఉండే షా ఇప్పుడు మనసు విప్పి తనతో మాట్లాడుతున్నందుకు సంతోషిస్తూవుంటే కోడికాలు కొరుకుతూ "నేను వెళ్ళి వచ్చిన నెలరోజులలో చెప్పుకోదగ్గ సంఖ్యలో ఆపరేషన్లు చేశావే ఎలా?" అని కాసింత ప్రశంస, కాసింత ఆశ్చర్యం కలిపి అడిగాడు. "నేను ఢిల్లీ సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో కొన్నాళ్ళు సీనియర్ హౌజ్ సర్జన్‌గా వెలగబెట్టాను. అప్పటికి ఇంకా ఆర్మీలో చేరలేదు. మనిషికి స్పృహ కోల్పోనిచ్చే అవసరం లేకుండా లోకల్ ఎనెస్థీషియా ఇచ్చి ఆపరేట్ చేసే కొన్ని పద్ధతులు నేర్చుకున్నాను. అప్పట్లో మాకు ఎనెస్థిటిక్ గాసెస్‌కి ఎక్కువ కొరత ఉండేది." అని తన అనుభవాలు కొన్ని పాతవి జ్ఞాపకం చేసుకున్నాడు. "మంచిదే, ఇక నువ్వే సర్జికల్ యూనిట్‌ని మేనేజ్ చేసుకో. నేను నా పోస్టింగ్ ఆర్డర్స్ కోసం ఎదురు చూస్తూ హాయిగా గడిపేస్తాను" అని ఛలోక్తి విసిరి సిగరెట్ ముట్టించాడు షా.

వారంరోజులు విడవకుండా కురిసిన వాన ఆ రోజే కాస్త తెరిపిచ్చింది. మధ్యాహ్న భోజనం తర్వాత అలా లుంగ్లే దిశగా బయలుదేరాడు. స్టోన్ క్వారీ దాటిన తర్వాత జీపులు, బస్సులు క్యూకట్టి నిలిచిపోయాయి. ఒక కొండ చరియ విరిగి పడి ఘాట్ రోడ్డును మూసేసింది. అదృష్టవశాత్తూ ఏ ప్రాణ నష్టం జరగలేదు. అవతల వైపు నుంచి రెండు బుల్‌డోజర్లు వచ్చి పనిచేసి అర్ధగంట శ్రమపడి బళ్ళు వెళ్ళడానికి దారి చేశాయి. అక్కడ పనిచేస్తున్న రోజుకూలీల మాటల్లో దేశంలోని అన్ని భాషలు వినిపిస్తున్నాయి. వాళ్ళతో కొందరు మిజోలు కూడా చెయ్యికలిపి పనిచేస్తున్నారు.

లుంగ్లే వెళ్ళి, డాక్టర్ దీనా ఇంటి తలుపు తట్టి "పూ- దీనా ఓమ్ ఏమ్" అని అడిగాడు. దీనా గారు ఉన్నారా? అని మిజోల భాషలో దాని అర్థం. డాక్టర్ దీనా భార్య వచ్చి తలుపు తీసింది. ఆమెను చూడగానే " చిబ్సోయ్" (హల్లో) అని పలుకరించాడు చంద్రం. సాదరంగా లోనికి ఆహ్వానించి మా భాష మాట్లాడేస్తున్నావే అని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టింది. దీనా ఇంతలో చంటిపిల్లని ఎత్తుకుని వచ్చి సోఫాలో కూర్చుని 'ఏమిటి

విశేషాలు' అని అడిగాడు. " నాకొక చిన్న సహాయం చెయ్యాలి. రెండు ఫ్రాక్చర్ కేసులున్నాయి. నా దగ్గిర ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పాతదైపోయింది. గట్టిపడ్డం లేదు. నాకొక డజన్ రోల్స్ ఇస్తే మళ్ళా నాకు స్టాక్ రాగానే ఇచ్చేస్తాను" అన్నాడు ప్రాధేయపూర్వకంగా చంద్రం. "ఒస్సీ ఇంతేనా. తప్పకుండా ఇస్తాను. ఇలాటి అవసరం వస్తే నేనే ఉండనక్కరలేదు. నా అసిస్టెంట్ సాంగా ఉంటాడు. నేనతనికి చెప్తాను. నిస్సంకోచంగా అడిగి తీసుకెళ్ళవచ్చు" అని దీనా అంటూవుండగానే రెండుకప్పులతో వేడిగా కాఫీ అందించింది అతని భార్య. అలా ఆ కుటుంబంతో ఏర్పడ్డ చనువు ఆధారంగా ఆ రోజు మాటల సందర్భంగా చంద్రం బలబీర్ ద్వారా విన్న రోడ్డు ప్రమాదం సంఘటన ముచ్చటించి తన సందేహాన్ని వ్యక్తం చేశాడు. " ఎండనక వాననక ఎందరో ఇంజనీర్లూ లేబరర్లూ దూరాబారం నుంచి వచ్చి రోడ్లు వేస్తూ వుంటే అంత కఠినంగా వ్యవహరిస్తారెందుకు ఇక్కడి మిజో యువకులు" అని నిలదీశాడు. చిన్నగా నవ్వుతూ "నువ్వన్నది నిజమే కానీ ఎన్నో తరాలుగా ఈ కొండల్లో సర్వస్వతంత్రులుగా స్వేచ్ఛగా సంచార జీవితం గడిపిన వాళ్ళు ఇప్పుడిప్పుడే క్రమంగా నాగరిక జీవితానికి దగ్గరగా వస్తున్నారు. ఇక్కడ సంచరించే ఉద్యోగులు తమ మంచికే కృషి చేస్తున్నారన్న విశ్వాసం బలపడ్డానికి కొంత కాలం పడుతుంది. అది ఒక్క రోజులో సాధ్యం కాదు. నీ అంత ఉత్సాహాన్నీ స్నేహధర్మాన్నీ అందరూ చూపిస్తారని చెప్పలేం కదా. అవకాశవాదులు అటూ ఇటూ కూడా కొందరు ఉంటారు. రెండు దశకాలు తిరుగుబాటు దారిలో నడిచి ఇప్పుడే నెమ్మదిగా మారుతున్నారు" అన్నాడు నిష్కర్షగా దీనా. లుషాయ్ కొండల్లో విరిసిన అడవి పూలలా కనపడ్డారు ఆ దంపతులు ఆ క్షణంలో. ఒక వింత తృప్తితో మెస్‌కి చేరుకున్నాడు చంద్రం.

సురేందర్ షా ఒక ఉదయం యూనిఫామ్ వేసుకుని బ్రేక్ ఫాస్ట్ చేస్తూ తన మీదకి ఏదో విపత్తి వచ్చిపడ్డట్టు మొహం పెట్టాడు. "దిమాగిరి దగ్గర ఏదో ఆఫీసులో స్టాక్ వెరిఫికేషన్ చేసి రిపోర్టు పంపమని గ్రెఫ్ కమాండర్ కోరారు" అంటూ చంద్రం వేపు చూశాడు. "నాక్కూడా అలాటి బాధ్యత ఒకటి నిర్వహించమని మొన్న హెడ్ క్వార్టర్స్‌కి వెళ్ళినప్పుడు అప్పగించారు. నెంగ్‌పూయ్, బుంగ్తలాంగ్ దగ్గర ఆఫీసులకు పోవల్సి ఉంది" అన్నాడు చంద్రం.

"అయితే ఇంకనేం, నీ పని ముందు కానిచ్చిరా. ఆ తర్వాత నేను వెళ్తాను. ఇద్దరం ఒకేమారు హాస్పిటల్ విడిచిపెట్టి పోలేం కదా" అని అప్పటికి తన పనిని వాయిదా

వేసుకోగలిగినందుకు తృప్తిగా ఒక సిగరెట్ వెలిగించాడు.

అనుకోకుండా వచ్చిపడ్డ అవకాశాన్ని శ్రద్ధగా వినియోగించుకుని ఆ నెలలో చంద్రం ఆపరేట్ చేసి ఒక థయిరాయిడ్ గోయిటర్‌ని సునాయాసంగా తీసేశాడు. మనసులో ఎంతో తృప్తితో ఉల్లాసంగా ఉన్న సమయంలో ఈ బాధ్యత వచ్చింది. అలా మిజోరమ్ మారుమూలలు చూడవచ్చుకదా అని, బలబీర్‌ని పిలిచి జీప్ సిద్ధం చెయ్యమని చెప్పి లౌంగ్త్లాయ్‌లో రాత్రి విశ్రమించి మర్నాడు ఉదయమే నెంగ్‌పూయ్ దిశగా బయలుదేరాడు. నెంగ్‌పూయ్ దగ్గర ఆఫీసులో తన వెరిఫికేషన్ పని ముగించుకుని అక్కడి నది మీద తాత్కాలికంగా నిర్మించిన కొయ్య వంతెన దాటి మధ్యాహ్నానికల్లా బుంగ్త్లాంగ్ చేరుకున్నాడు. అక్కడ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ కుమార్ స్వాగతం చెప్పి "మధ్యాహ్న భోజనం సిద్ధంగా ఉంది. తర్వాత కాస్త విశ్రాంతి తీసుకుని మీ పని చూసుకో వచ్చు" అని సూచించాడు. "భోజనం ఒక్క రోజు ఆలశ్యం అయితే వచ్చిన నష్టం లేదు. మీరు పడమటి దిశగా కొత్త రోడ్డు కొండల మీంచి వేస్తున్నారట కదా. చూడాలని ఉంది" అని చంద్రం తన కోరికను బయటపెట్టాడు. దానికేం అలాగే వెళ్దాం అని సురేష్ కుమార్ జీపు వెనకాల కూర్చోబోతూ వుంటే వారించి, "బలబీర్ సింగ్ ఉదయాన్నించీ డ్రైవ్ చేసి అలసిపోయి ఉన్నాడు. ఈ జీపుకి కూడా కాస్త విశ్రాంతినిద్దాం. మీకు ఇబ్బంది లేకపోతే మీ జీపులో వెళ్ళివద్దాం.." అన్నాడు బాగా అలసినట్టున్న బల్‌బీర్ వేపు జాలిగా చూస్తున్న చంద్రం.

డ్రైవర్ రాస్‌బిహారి సిద్ధం చేసి తీసుకొచ్చిన జీపులో చంద్రం, సురేష్‌కుమార్ కూర్చున్నారు. రాస్‌బిహారి శ్రద్ధగా జీపుని నడుపుతున్నాడు. ఇరవై కిలోమీటర్లు ఆ కొత్తగా వేస్తున్న ఘాట్ రోడ్డు మీద వెళ్ళే సరికి గంటన్నర కాలం పట్టింది. రెండు బుల్ డోజర్లు అక్కడ కొండ చరియను కోరి రోడ్డును వెయ్యడానికి శ్రమపడుతూ వుంటే, ఎందరో పనివాళ్ళు అక్కడ కష్టపడుతూ వుంటే రోడ్లు కొండల మీద వెయ్యడంలో ఉన్న సాధక బాధకాలు చూస్తున్న చంద్రానికి కాల గమనమే తెలియడం లేదు. "ఇక మనం వెనక్కు మళ్ళడం మంచిది. మీరు రాక రాక ఇలా వస్తే మీకు భోజనం ఆలశ్యం అయిపోయింది. ఇప్పటికే నాలుగు దాటుతోంది. ఇక చీకటి పడిపోతుంది కూడా" అని సురేష్ జీపుని వెనక్కు మళ్ళించాడు. కాసింత దూరం వెళ్ళిన జీపు ముందుకు పోవడానికి మొరాయించింది. "వచ్చినప్పుడు పెట్రోల్ చెక్ చేసుకోలేదా?" అన్నాడు బోనెట్ ఎత్తుతున్న రాస్‌బిహారి వేపు విసుగ్గా చూస్తున్న సురేష్. "పెట్రోలుకి లోటు లేదు కానీ

కార్బొరేటర్ క్యాప్ పాడయి ఎయిర్ లీక్ అవుతోంది" ఆ అవాంతరానికి తనే బాధ్యుడైనంతగా బాధపడిపోతూ చెప్పాడు రాస్‌బిహారి. చీకట్లు ముసురుకుంటూ వుంటే ఎదురుగా హెడ్‌లైట్లు వెలుగుతూ జీపు వచ్చింది. అందులోంచి బలబీర్ సింగ్ అతనితో పాటు బుంగ్తలాంగ్ ఆఫీసులోని ఇంకో ఇద్దరు గ్రెఫ్ ఉద్యోగులు దిగారు. "భోజనంవేళ మించిపోతున్నా మీరు రాకపోయే సరికి మీ జీపు పాడయివుంటుందని ఊహించి ఇలా వచ్చాం" అన్నారు. సమయస్ఫూర్తిని చూపినందుకు సంబరపడి పోతూ "ఇక ఆలశ్యం చెయ్యవద్దు. పోదాం. మీ జీపును వెనక్కు తిప్పి దాని వెనక పాడయిన జీపుని తాటితో కట్టండి" అని తొందర చేశాడు సురేష్‌కుమార్.

ముందున్న జీపుని బలబీర్ నడుపుతున్నాడు. ప్రక్కనే చంద్రం సురేష్ కూర్చున్నారు. వెనుకనున్న జీపు స్టీరింగ్ రాస్ బిహారి పట్టుకుని అనుసరిస్తూ వుంటే అతని ప్రక్కన మిగతా ఇద్దరు ఉద్యోగులు కూర్చున్నారు. బుంగ్తలాంగ్ ఇంక నాలుగు కిలోమీటర్ల దూరం ఉందనగా వచ్చిపడిందో విపత్తు. ఘాట్ రోడ్డు అంచున ఉన్న ఏదో చిన్న గ్రామం నుంచి పది మందికి పైగా యువకులు జీపు ముందరకు పరుగు పరుగున వచ్చి ఆపమని నిలిపేశారు. ఇంతలో ఇంకొందరు రాళ్ళూ కర్రా కంపా, జీపుకి అడ్డంగా పడేసి మోటర్‌ని ఆపమన్నీ వాళ్ళ భాషలో గోల చేస్తున్నారు. ఏం జరిగిందో అర్థం కావడం లేదు. చంద్రానికి ఆ ప్రాంతం అంతా కొత్తది. ఊహించకుండా వచ్చిపడ్డ ఈ పరిణామానికి ఆశ్చర్యపోతూ ప్రక్కన కూర్చున్న సురేష్ వంక చూశాడు. ఆ క్షణంలో సురేష్ తన జేబులోంచి ఒక చిన్న మాత్ర నోట్లో ఉంచుకుని తన కుడి చేత్తో ఎడమ వేపు ఛాతీ మీద రాసుకుంటున్నాడు. ఇక చంద్రం ఆ సవాలు తనదిగా చొరవ తీసుకోక తప్పలేదు. ఇంతలో వెనక జీపులోంచి ముగ్గురూ దిగి బలబీర్ సింగ్ దగ్గరకు వచ్చి, పిల్లవాడు జీపు కింద పడ్డాడని ఆ యువకులు చెప్తున్నట్లుగా వివరించారు. క్షణికమైన అధైర్యం మాయమైపోయింది. జీపుని ఆపమని బలబీర్‌కి చెప్పి, చంద్రం క్రిందికి దిగాడు. అతనితో సురేష్,బలబీర్ కూడా దిగిపోయారు.

చంద్రం నేర్చుకున్న మిజోల భాష అంతంత మాత్రమే. ఇలాటి క్లిష్ట సమయంలో సరిపడే అంతగా రాదు. అయినా సగం హిందీ, సగం ఇంగ్లీషు, కొంత మిజో కలిపి "ఏమైందీ స్పష్టంగా చెప్పకుండా గొడవ చెయ్యడం సబబు కాదు"అని అరిచాడు. "మామాగిరా, మామా మరగయా, మామా డెడ్"- అని ఆ యువకుల్లో కొందరు అరుస్తూ వుంటే ఇంకొకడు జీపు టైరులో గాలి తీసే ప్రయత్నం చేస్తున్నాడు. మరొకడు బలబీర్

చెయ్యి పట్టి గుంజుతున్నాడు. వెర్రి ఆవేశం తప్ప ఎవరిలోనూ సహనం కనుపించడం లేదు. మామా అంటే మిజో భాషలో చిన్న పిల్లడని అర్థం. "మీ మామాలో కొన ప్రాణం ఉన్నా బ్రతికించే ప్రయత్నం చెయ్యాలి. బుంగ్తలాంగ్‌లో మెడికల్ ఇనస్పెక్షన్ రూమ్ ఉంది. జీపులో గాలి తియ్యవద్దు, నేను డాక్టర్ని" అని గట్టిగా గర్జించినంతపని చేశాడు. ఇంతలో ఇద్దరు శాంతించిన యువకులు చంద్రాన్ని వెనక్కు నడిపించుకుని వెళ్ళి కుర్రవాడు పడిపోయిన చోటికి తీసుకుని వెళ్ళారు.

"బలబీర్! డిక్కీలో ఉన్న టార్చిలైటు, ఫస్టెయిడ్ బాక్స్ తీసుకురా" అని తొందర చేశాడు చంద్రం. పిల్లవాడి కంటి పాపల మీద లైటు వేసి చూసి ధైర్యంగా ఊపిరి తీసుకున్నాడు. రెండు భుజాల క్రిందా చేతులు వేసి నిలబెట్టి చూశాడు. కుర్రవాడు చక్కగా నిలబడగలిగాడు. మోకాలి చిప్పల రెండిటి మీదా చర్మం కాసింత చెక్కుకుని రక్తం చిమ్మింది. గడ్డం మీద చిన్నగా దెబ్బ తగిలింది. వేరే ప్రాణ భయం ఎక్కడా కనబడలేదు. పిల్లవాడు చనిపోయాడని రాద్ధాంతం చేసిన కారణమేమీ కనపడలేదు. పెద్ద గొడవలు జరక్కుండా ఇంతలో గ్రెఫ్ ఉద్యోగులు వెళ్ళి పోలీస్ ఇన్స్‌పెక్టర్ని తీసుకుని వచ్చారు. మిజో యువకులు కొందరు వెళ్ళి విలేజి కౌన్సిల్ ప్రెసిడెంట్‌ని తెచ్చి పిల్లవాడికి దెబ్బలు తగిలినందుకుగానూ నష్ట పరిహారంగా రెండు వేలు ఇప్పించమని గట్టిగా ఒత్తిడి చేస్తున్నారు. పోలీస్ ఇన్స్‌పెక్టర్ని ఉద్దేశించి "నేను మేజర్ రామచందర్‌ని, సర్జికల్ స్పెషలిస్టుని. మా డ్రైవర్ బలబీర్ ఎంతో బాధ్యతగా జీపు నడుపుతాడు. నేను ప్రక్కనే ఉన్నాను. మా జీపు క్రింద పిల్లవాడు పడనే లేదు. జీపు రోడ్డు మీద వెళ్తున్నప్పుడు పిల్లలు టాటా చెప్పడం, దాని వెనుక కొంత దూరం పరిగెట్టడం తరుచూ జరుగుతుంది. అలా పిల్లవాడు బోర్లా పడినట్టు వాడికి తగిలిన గాయాలు చెప్తున్నాయి. ఎనిమిది చక్రాల కింద పడి ప్రమాదం లేకుండా తేలికగా బయటపడడం సాధారణంగా జరగనే జరగదు. మీరు అవసరమని అనుకుంటే కేసు రిజిష్టరు చేసుకుని చట్టబద్ధంగా నడిపించండి. డ్రైవర్ని బాధిస్తే నేను ఒప్పుకోను" అని నిష్కర్షగా చెప్పాడు చంద్రం. కానీ అక్కడ కొందరు మిజో యువకులు కనీసం ఐదు వందలైనా నష్ట పరిహారం ఇప్పించమని విలేజి కౌన్సిల్ ప్రెసిడెంట్ మీద ఒత్తిడి తెచ్చి విపరీతమైన గొడవ చేస్తున్నారు. ఆ గ్రామ పెద్ద ఎటూ చెప్పలేక నీళ్ళు నములుతున్నాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడ చేరిన మూకను ఛేదించుకుంటూ ఒక నడివయస్కుడు వచ్చి మిజో భాషలో మేఘంలా ఉరిమి ఆ యువకుల్ని మందలించాడు. అక్కడివాళ్ళు మంత్రం వేసినట్లు చల్లబడిపోయారు.

విలేజి ప్రెసిడెంట్ కూడా ఆ వ్యక్తిని ఎంతో గౌరవించడం చంద్రానికి ఆశ్చర్యం వేసి అతని వేపు చూశాడు. ఆ మొహం ఎక్కడో ఇదివరకు చూసినట్లనిపించింది. "నేను లాల్ మోయాను. లుంగ్లే ఆసుపత్రిలో మనం కలిశాం. మీరు మిజోలంటే చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు. మీరు నిశ్చింతగా వెళ్ళండి" అని కొంత హిందీ, కొంత మిజో భాషను మిళితం చేసి పంపించాడు. బుంగ్తలాంగ్ చేరుకున్నాక చంద్రానికీ- తనతో ఉన్న ఇతర ఉద్యోగులకూ మనసు కుదుటపడ్డానికి చాలా సమయం కావలసి వచ్చింది. అక్కడ ఏర్పాటు చేసిన విందు భోజనం రుచిని తృప్తిగా ఆస్వాదించలేక పోయారు. రాత్రికి అక్కడే చంద్రం విశ్రమించాడు.

మరునాడు ఉదయాన్నే బయలుదేరి లౌంగ్తలాయ్ రెస్ట్ హౌజ్‌లో ఒక గంట విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నాడు కానీ బాగా అలసిన చంద్రానికి ఒళ్ళు మరచిన నిద్ర పట్టింది. రాత్రికికానీ తన మెడికల్ కాంప్లెక్స్‌కి చేరుకోలేక పోయాడు. ఎనిమిదిన్నర దాటింది చేతి వాచీ చూసుకుంటే. "ఇవాళ ఉదయమే వచ్చేస్తావనుకున్నాను. కానీ మధ్యాహ్నం ఎవరో సిగ్నల్స్ పంపారు. దారిలో జీపు పాడయిందనీ, ఏదో గొడవ జరిగిందనీ, నువ్వు కాస్త ఆలశ్యంగా వస్తావనీ తెలిసింది" అన్నాడు అప్పటికే మెస్‌లో భోజనం ముగిస్తున్న సురేందర్ షా.

"జీపు కింద మిజో పిల్లవాడు పడిపోయాడన్న భ్రమతో అక్కడ గ్రామస్థులు గొడవ చేశారు" అంటూ వివరంగా జరిగిన సంఘటన గురించి చెప్పాడు చంద్రం. "నీ పిచ్చికానీ వాళ్ళంతే. ఆవేశం, అజ్ఞానం. దానికి తోడూ ఈ మధ్య రాజకీయం జోడవుతోంది" అన్నాడు షా. యాంత్రికంగా ఆ మాటలు వింటున్న చంద్రం గత సాయంత్రం సంఘటనను విశ్లేషించుకుంటున్నాడు. షా అనుకున్నట్లే తను కూడా నిస్పృహతో అనుకున్న మాట నిజమే. కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఆలోచించ గలుగుతున్నాడు. బాగా చీకటి పడ్డాక రోడ్డుమీద రెండు జీపులు వరుసగా వెళ్ళడం, ఆ వెనుకనే పిల్లవాడు బోర్లా పడడం చూసిన వాడెవడైనా జీపులు పిల్లవాణ్ణి నెట్టేసి -పారిపోతున్నాయనే భావించడం జరుగుతుంది. అలాటి సమయాల్లో ఆవేశంతో తొందరబాటుతో ఎప్పుడూ డ్రైవర్నే తప్పు పట్టడం, హింసించడం, వాహనాన్ని తగుల బెట్టడం నాగరికులున్న మహానగరాల్లోకూడా తరుచూ జరిగిన వార్తలు పేపర్లో రావడం అసాధారణం కాదు. కానీ పిల్లవాడు బండి కింద పడలేదని చెప్పినా, వాడు క్షేమంగా ఉన్నా, అల్లరి చెయ్యడం, డబ్బు గుంజే ప్రయత్నం చెయ్యడం కొంత చంద్రం మనసుని గాయపరచింది. అందుకే షా

అన్న మాటలకు తన ప్రతిస్పందన తెలపలేక ఊరుకుండి పోయాడు.

ఎప్పటిలా మరునాడు ఉదయం చంద్రం, సురేందర్ షాలు ఇద్దరూ ఆసుపత్రికి మెట్లు దిగి వెళుతూ ఉండగా వార్డు ముందు కొందరు కప్పూ యువకులు గుమిగూడి నిలబడ్డారు. "పొద్దున్నే ఏదో యాక్సిడెంట్‌లా ఉంది" అన్నాడు షా. కొంపతీసి మొన్నటి కుర్రవెధవ గుటుక్కుమనలేదుకదా!" అనుకున్నాడు చంద్రం.

వాళ్ళ మధ్యన నిలుచున్న లాల్‌మోయా ముందుకొచ్చి "మా గ్రామంలోని యువకులు మొన్న చూపిన కుర్రచేష్టకి చింతిస్తున్నారు. అది చెప్పాలనే ఇలా వచ్చారు" అన్నాడు. ఒక యువకుడు తన చేతిలోని అడవి కోడిపుంజునూ, అరటి పళ్ళ గెలనూ అందిస్తూ ముందుకు అడుగువేశాడు. ఇంకో చిన్న పిల్లవాడు చిత్రంగా నవ్వుతూ చంద్రం చేతిలో కొండమల్లెల గుత్తిని ఉంచాడు.

చంద్రం సంకోచంతో, సిగ్గుతో కల్నల్ షా వేపు చూశాడు. 'వెల్డన్ మై యంగ్ మన్' అన్నట్టు షా నవ్వుతున్నాడు. నిర్మలంగా ఉన్న ఆ నవ్వు చంద్రం మనసులోని తృప్తిని రెట్టించింది.